సాక్షి చిత్తూరు

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



కార్యకర్తలకు అండగా..

కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. - 8లో



బోయకొండ కిటకిట

చౌడేపల్లె మండలంలో ప్రసిద్ధి చెందిన బోయకొండ పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. - 8లో



'హద్దు'మీరిన ఇసుక డంప్‌లు

పలమనేరు మండలంలో నదులు, సెలయేళ్ల నుంచి అక్రమంగా తరలించిన ఇసుకను కర్ణాటక సరిహద్దుల్లో డంపు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా కృష్ణమోహన్



చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఈయన, జిల్లా పరిపాలన న్యాయమూర్తిగా వ్యవహరించనున్నారు. గతంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన రావు ఉండగా, ఆయన స్థానంలో కృష్ణమోహన్ నియమితులయ్యారు.

నిత్యావసరాల విరాళం



నిత్యావసరాలు తరలిస్తున్న వాహనం

పలమనేరు:పట్టణానికి చెందిన హిందూ, ముస్లిం సోదరులు విరాళాలద్వారా సేకరించిన రూ.6 లక్షల విలువైన 20 రకాల నిత్యావసర సరుకులను స్థానిక మార్కెట్‌నుంచి ప్రత్యేక వాహనంలో విజయవాడకు ఆదివారం తరలించారు. నిర్వాహకులు జీలు, జాఫర్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కోసం సాయం చేసిన హృదయపూర్వకంగా ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వరసిద్ధుని దేవస్థానానికి ఐఎస్‌ఓ సర్టిఫికెట్



ఐఎస్‌ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి అత్యంత ప్రతిష్టాత్మమైన ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను శనివారం హైదరాబాద్ ఐఎస్ఓ ఎండీ శివయ్య ఎమ్మెల్యే మురళీ మోహన్, ఈవో గురు ప్రసాద్‌కు అందజేశారు. ఆలయంలో అమలవుతున్న ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, ఆలయ విభాగం, పరిపాలన విభాగం, ప్రమాణాలపై ఈ సర్టిఫికెట్లను అందజేసినట్లు వెల్లడించారు.


రేపు ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పుంగనూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 10 తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి పద్మజ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఇనోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తామన్నారు. ఆ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తారని తెలిపారు. పది నుంచి డిగ్రీ వరకు పాస్, ఫెయిల్ అయిన వారు (18 నుంచి 35 సంవత్సరాలు) మధ్య వయస్సు ఉన్న వారు ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 77805 99208, 96761 80056 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనివార్యకారణాల వల్ల వాయిదా వేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9న సోమవారం నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ మంగళవారం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు మంగళవారం వినతులు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

జీతాలందక ద్రవిడ వర్సిటీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



రామకృష్ణ (ఫైల్)

గుడుపల్లె: జీతాలందక అప్పుల పాలై మనస్తాపానికి గురైన ద్రవిడ వర్సిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించారు. మండలంలోని కుప్పిగానిపల్లెకు చెందిన రామకృష్ణ (45) ద్రవిడ వర్సిటీలో హౌస్‌కీపర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే ద్రవిడ వర్సిటీలో 13 నెలల నుంచి ఆయనకు జీతాలు ఇవ్వలేదు. విధిలేక కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. అటు జీతాలు రాక, ఇటు అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. అయితే స్థానికులు గమనించి వెంటనే కుప్పం ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

● లంబోదర.. భక్త మందార



చిత్తూరు డీఐ రోడ్డులో కొలువుదీరిన వినాయకుడు

మూషిక వాహనా పాహిమాం.. పార్వతీ తనయా పాహిమాం.. అంటూ జిల్లా ప్రజలు విఘ్ననాథుడిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. పిండి పదార్థాలు, ఉండ్రాళ్లు, స్వీట్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా మట్టి విగ్రహాలు, సైకత శిల్పాలతో లంబోదరుడిని పూజించారు. వినాయక వ్రతం ఆచరించి పునీతులయ్యారు. అలాగే గ్రామాలు, పట్టణాల్లో యువత మంటపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలతో సందడి చేశారు. ఉట్టికొట్టడం, బరువు మోయడం, స్తంభం ఎక్కడం వంటి ఆటల్లో పోటీ పడ్డారు. కొందరు అన్నదానంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి, డెస్క్



నగరి: ఓంశక్తి ఆలయం సమీపంలో కొలువైన మట్టి గణపయ్య

ఓపెన్ ఆఫర్!

అక్షరాస్యత పెంచాలి.. అర్ధంతరంగా విద్యాభ్యాసం మానేసిన వారికి సైతం మరో అవకాశం కల్పించాలి.. చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్నవారిని ప్రోత్సహించాలి.. ఇదే లక్ష్యంతో ప్రభుత్వం ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీని ఏర్పాటు చేసింది. దూర విద్యా విధానం ద్వారా అభ్యర్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. అయితే కొందరు స్టడీ సెంటర్ నిర్వాహకులు మాత్రం ఓపెన్ స్కూల్ ఉద్దేశానికి తూట్లు పొడుస్తున్నారు. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. పాస్ గ్యారెంటీ స్కీమ్ పేరిట ముందస్తుగా తమతో డీల్ కుదుర్చుకున్న వారికే అడ్మిషన్ ఇస్తూ సర్టిఫికెట్లను మార్కెట్‌లో పెట్టి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు.





- పాస్ గ్యారంటీ స్కీమ్ పేరుతో వసూళ్లు
- ఓపెన్ స్కూల్ సొసైటీలో యథేచ్ఛగా అక్రమాలు
- ముందస్తుగా డీల్ కుదుర్చుకుంటేనే అడ్మిషన్లు
- ఇష్టారాజ్యంగా దోచుకుంటున్న స్టడీ సెంటర్ నిర్వాహకులు
- అడిగినంత చెల్లించకుంటే సర్టిఫికెట్ ఇవ్వకుండా వేధింపులు

చిత్తూరు కలెక్టరేట్ : చదువుకోవాలనే కోరిక ఉన్న వారి ఉజ్వల భవిష్యత్ బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (దూరవిద్యావిధానం)పై ఆరోపణలు అధికమవుతున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల కింద ఏర్పాటైన మొత్తం 104 స్టడీ సెంటర్లలో అక్రమాలపై తీవ్రమైన విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా ఆయా సెంటర్లతో చేపట్టే అడ్మిషన్ల కసరత్తు నుంచే నిర్వాహకులు అవినీతికి పాల్పడుతున్నారు. అర్ధంతరంగా చదువు మానేసి, ఇప్పుడు కొనసాగించాలనుకుంటున్న అభ్యర్థులు, గ్రామీణ యువత, మహిళలు, ఉద్యోగోన్నతుల కోసం పరీక్షలు రాసేవారిని మోసం చేస్తున్నారు.

ముందస్తుగా సగం చెల్లించాల్సిందే!

వివిధ శాఖల్లో పనిచేస్తూ ఉద్యోగోన్నతి కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు, ఇతర అవసరాల కోసం పరీక్షలు రాసేందుకు అడ్మిషన్ పొందే అభ్యర్థులు అధికంగా నగదు చెల్లించాల్సిందే. ముందుగా డీల్ కుదుర్చుకుంటేనే అడ్మిషన్ కల్పిస్తారు. ఇలా పది, ఇంటర్‌లో ప్రవేశం పొందే అభ్యర్థులు ముందస్తుగా కుదుర్చుకున్న డీల్ ప్రకారం సగం నగదు చెల్లించాల్సిందే. పరీక్షల సమయంలో విద్యాశాఖ అధికారులతో స్టడీ సెంటర్ నిర్వాహకులు కుమ్మక్కై మాస్ కాపీయింగ్‌కు అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలోనే పరీక్షలు పూర్తి అయ్యాక మిగిలిన డీల్‌లో భాగంగా మిగిలిన సొమ్మును వసూలు చేసుకుంటారు. మొత్తం వ్యవహారంలో విద్యాశాఖ అధికారులకు సైతం ముడుపులు చేరుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓపెన్ స్కూల్‌నే ఆదాయ వనరుగా చేసుకున్న స్టడీ సెంటర్ నిర్వాహకులు రూ.కోట్లకు పడగలెత్తినట్టు సమాచారం.

అడిగినంత ఇచ్చుకోవాల్సిందే!

2023–24 సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్మీడియట్ ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు చిత్తూరు జిల్లా నుంచి 5,703 మంది, తిరుపతి జిల్లా నుంచి 3,965 మంది హాజరయ్యారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రైవేట్ సెంటర్ల నిర్వాహకులు సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీరి అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభ్యర్థుల చిరునామాకే పోస్టు ద్వారా సర్టిఫికెట్‌లు పంపించే విధానం ప్రవేశ పెట్టింది. అయితే కొంత మంది నిర్వాహకులు మోసపూరితంగా వ్యవహరిస్తూ అడ్మిషన్ సమయంలో అభ్యర్థుల అడ్రెస్ నమోదు చేయకుండా సర్టిఫికెట్‌లు తమకే అందేలా చేసుకుంటున్నారు. అనంతరం అభ్యర్థులు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నగదు చెల్లించాకే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. ఈ విషయం తెలిసినా విద్యాశాఖ అధికారులు కాసులకు కక్కుర్తిపడి నోరు మెదపడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉభయ జిల్లాల సమాచారం

చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ ఓపెన్ స్కూల్ సెంటర్లు	33
ప్రైవేట్ కేంద్రాలు	22
తిరుపతి జిల్లాలో ప్రభుత్వ ఓపెన్ స్కూల్ సెంటర్లు	18
ప్రైవేట్ కేంద్రాలు	31
రెండు జిల్లాల్లో గత ఏడాది పది పరీక్షలు రాసిన వారు	2,451
ఇంటర్ పరీక్షలు రాసిన వారు	7,217

రెగ్యులర్ స్థాయిలోనే విలువ

ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్‌లకు రెగ్యులర్ ధ్రువీకరణ పత్రాల స్థాయిలోనే విలువ ఉంది.ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు, ఉద్యోగోన్నతులు పొందేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. దీంతో చాలా మంది ఓపెన్‌స్కూల్ వైపు మొగ్గుచూపుతున్నారు. నామమాత్రపు ఫీజుతో అడ్మిషన్ తీసుకుని, నిర్వాహకులు అడిగినంత ముట్టజెబితే దర్జాగా చేతిలో సర్టిఫికెట్ వచ్చేస్తుంది. దీంతో అభ్యర్థుల అవసరం, ఆత్రుతను స్టడీ సెంటర్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇబ్బంది పెట్టడం వాస్తవమే



ఓపెన్ స్కూల్ విధానంలో అక్రమాలు జరుగుతున్నాయి. అభ్యర్థులను ప్రైవేట్ సెంటర్ నిర్వాహకులు మోసం చేస్తున్నారు. జిల్లా వాసులనే కాకుండా పక్క రాష్ట్రాల వారి నుంచి కూడా భారీగా నగదు వసూలు చేస్తున్నారు. వీరి అక్రమాలను అరికట్టాల్సిన విద్యాశాఖ అధికారులు మామూళ్లకు ఆశపడి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

భారీగా వసూళ్లు

ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు ఇస్తుంటారు. ఈ క్రమంలో స్టడీ సెంటర్ నిర్వాహకులు పాస్ గ్యారెంటీ స్కీమ్ పేరుతో అధిక మొత్తానికి అభ్యర్థుల నుంచి ముందస్తు డీల్ కుదుర్చుకుంటున్నారు. ఇందుకోసం భారీగా నగదు వసూలు చేస్తున్నారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్‌కు అపరాధ రుసుం లేకుండా జనరల్ కేటగిరీకి రూ.1,400, రిజర్వేషన్ ఉన్న వారు రూ.1,100 చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతికి అపరాధ రుసుం లేకుండా జనరల్ కేటగిరీకి రూ.1,300, రిజర్వేషన్‌లు ఉన్నవారు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ముఖ్యంగా చిత్తూరు, పలమనేరు, కుప్పం, తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు ప్రాంతాల్లోని స్టడీ సెంటర్ నిర్వాహకులు ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారు. అందులో తమిళనాడుకు చెందిన అభ్యర్థులకు అధికంగా ఎర వేస్తున్నారు. ఆ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులకు పాస్ గ్యారెంటీ స్కీమ్ పేరు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. పదో తరగతి సర్టిఫికెట్‌కు రూ.50 వేలు, ఇంటర్ సర్టిఫికెట్‌కు రూ.80 వేలు నుంచి రూ.లక్ష వరకు ముందస్తు డీల్ కుదుర్చుకుంటున్నట్లు తెలిసింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులనే వసూలు చేయాలి. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయ్. ఫిర్యాదులు అందితే వెంటనే సంబంధిత సెంటర్‌ను రద్దు చేస్తాం. పది, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు కచ్చితంగా సర్టిఫికెట్‌లు ఇచ్చేయాలి. నిర్వాహకుల వద్ద సర్టిఫికెట్‌లు ఉంటే సహించే ప్రసక్తే లేదు.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు

వరసిద్ధుని వైభోగం!

- శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు ఆరంభం
- హంస వాహనంపై విహారం
- శనివారం చవితి సంబరం
- రెండు రోజులుగా ఆలయంలో భక్తుల సందడి



హంస వాహనంపై అభయమిస్తున్న వరసిద్ధి వినాయక స్వామి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవ సంబరం ఆరంభమైంది. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ధ్వజారోహణ పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. వేదోచరణ, మంగళ వాయిద్యాల మధ్య ధ్వజస్తంభానికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం జరిపించారు. మూషిక చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై కట్టి ముక్కోటి దేవతలను కొలిచారు. మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం చేశారు.

పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్

వరసిద్ధుని ఆలయంలో శనివారం చతుర్థి వేడు కలను అట్టహాసంగా నిర్వహించారు. ఉద యం నుంచి రాత్రివరకు భక్తజనులతో ఆలయం కిక్కిరిసిపోయింది. వార్షిక బ్రహ్మోత్సవాలు, చవితిని పురస్కరించుకుని కలెక్టర్ సుమిత్‌కుమార్ వరసిద్ధునికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను సమర్పించారు. కలెక్టర్‌తో ఎస్పీ మణికంఠ చందోలు, ఎమ్మెల్యేలు మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్, ఈవో గురుప్రసాద్ మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి..స్వామిదర్శనం కల్పించడంతో పాటు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గణపతి వ్రతంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రాకతో ఆలయం కిక్కిరిసిపోయింది. వారు చందన అలంకారంలోని స్వామి వారిని దర్శించుకుని, భక్తిపరవశంలో మునిగిపోయారు. క్యూలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. వందలాదిగా వచ్చిన భక్తులు పుష్పకావళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాత్రి ఉత్సవమూర్తిని అలంకరించి మూషిక వాహనంపై ఊరేగించారు. మంగళ వాయిద్యాల నడుమ స్థానిక వీధుల్లో గ్రామోత్సవం చేశారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు.

హంస వాహనంపై చిద్విలాసం

ఉత్సవంలో భాగంగా వినాయకస్వామి ఆదివారం రాత్రి హంస వాహనంపై చిద్వి లాసంగా విహరించారు. తొలుత స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆ తర్వాత హంస వాహనంపై స్వామిని ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపుగా వస్తున్న స్వామిని భక్తులు దర్శించుకుని తన్మయం చెందారు. కర్పూర, పసుపు పళ్లేలతో హారతులు పట్టారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురు ప్రసాద్, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు మోహన్‌రెడ్డి, జగన్నాథ రెడ్డి, మణినాయుడు పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



పుష్పకావళ్లతో తరలివచ్చిన భక్తులు



పట్టువస్త్రాల సమర్పణలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

సహాయక చర్యలకు 125 మంది ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు జాయింట్ కలెక్టర్ విద్యాధరితో పాటు 125 మంది ఉద్యోగులను నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా నుంచి వెళ్లిన ఉద్యోగులు ఈ నెల 8వ తేదీన విజయవాడలోని తుమ్మనపల్లి కళాక్షేత్రంలో రిపోర్టు చేశారు. వీరిలో జేసీతోపాటు ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, వ్యవసాయ, హార్టికల్చర్, మైనారిటీ శాఖ, మైనార్టీ కార్పొరేషన్ ఈడీలు, పలమనేరు, కలెక్టరేట్, సోమల, చౌడేపల్లి, పుంగనూరు, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, జీడీనెల్లూరు, గుడిపాల, పూతలపట్టు, ఎస్‌ఆర్ పురం, నగరి, నింద్ర, గుడుపల్లి, కుప్పం, శాంతిపురం మండలాల నుంచి 16 మంది తహసీల్దార్‌లు, 66 మంది డిప్యూటీ తహసీల్దార్‌లు, 37 మంది ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్‌లు మొత్తం జిల్లా నుంచి 125 మంది సహాయక చర్యలకు జిల్లా నుంచి వెళ్లారు. జిల్లా నుంచి వెళ్లిన ఉద్యోగులు విజయవాడ, గుంటూరు వరద ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు సహాయక చర్యలో పాల్గొంటారు.

క్లుప్తంగా

కుక్కలు తెచ్చిన తంటా

పుంగనూరు: నడిరోడ్డుపై వీధి కుక్కలు వచ్చి ద్విచక్రవాహదారులపై పడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని బండ్లపల్లెకు చెందిన రెడ్డెప్ప, ద్విచక్రవాహనంపై వెళ్తుండగా నల్లగుట్లపల్లె క్రాస్ వద్ద వీధి కుక్కలు ద్విచక్ర వాహనంపై పడ్డాయి. దీంతో వాహనం అదుపు తప్పి కిందపడిన రెడ్డెప్పకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన విజయమ్మ ద్విచక్ర వాహనంపై నాలుగురోడ్ల కూడలిలో వస్తుండగా వీధికుక్కలు వాహనానికి అడ్డంగా దుసుకురావడంతో ఆమె పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమె ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. పట్టణంలో రోజు రోజుకూ వీధి కుక్కల బెడద తీవ్రమవుతోందని, వీటిని తక్షణమే జంతు సంక్షేమ కేంద్రానికి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడవచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

మాన్యం కౌలుకు వేలం

పలమనేరు: పట్టణంలోని శివాలయానికి చెందిన పలమనేరు, గంగవరంలోని నంజ, పుంజ భూములను మూడేళ్ల కౌలుకు ఇవ్వనున్నట్లు ఈవో కమలాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక శివాలయం వద్ద ఈ నెల 12న ఎండోమెంట్ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని అందులో పేర్కొన్నారు.

హద్దుమీరిన ఇసుక డంప్‌లు


కౌండిన్య నది పరివాహక ప్రాంతంలో ఇసుక డంప్‌లు


రాయల చెరువు ఏటి గట్టు ప్రాంతంలో డంప్‌లు

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇసుక పాలసీని సులభతరం చేసి ఉచితంగా అందిస్తామని చెప్పిన నాయకుల మాటలు నీటిమూటలయ్యాయి. అక్రమ రవాణాను అడ్డుకుంటామని బీరాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు కింది స్థాయి నాయకులు చేస్తున్న ఇసుక అక్రమాలపై నోరుమెదపడం లేదు. ఈ అక్రమ రవాణాపై అధికారులకు సమాచారం అందుతున్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూడక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

– సాక్షి టాస్క్‌ఫోర్స్

- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- నదులు, వాగుల నుంచి అక్రమ రవాణా
- నోరెత్తని అధికార యంత్రాంగం

పెద్దపంజాణి మండలంలో అధికారికంగా ప్రభుత్వ ఇసుక రీచ్‌లు లేకపోయినా కౌండిన్య నదీ పరివాహక ప్రాంతాలు, రాయల చెరువు ఏటి గట్టు ప్రాంతంలో ఇసుక లభ్యత పుష్కలంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయా పార్టీల కిందిస్థాయి నాయకులు ఇసుకపై పంజా విసిరారు. ఈ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారు. జిల్లాఅంతటికీ కలిపి చిత్తూరు పరిసరాల్లో అధికారిక రీచ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అంత దూరం పోలేని కొందరు గృహ నిర్మాణ దారులు స్థానికంగా దొరికే ఇసుకనే నమ్ముకుంటున్నారు. దీన్నే కూటమి నేతలు వరంగా భావించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.2,500 నుంచి రూ.3,500 వరకూ విక్రయించి దండుకుంటున్నారు.

కర్ణాటక సరిహద్దు వరం

ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ అవసరాల కోసమని చెబుతూ మండలంలోని రాయల చెరువు ఏటి గట్టు, కౌండిన్య నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల నుంచి భారీ స్థాయిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఉదయం పూట జేసీబీలతో తవ్వి ట్రాక్టర్లతో తరలించి ఒక చోట డంప్ చేస్తున్నారు. వాటిని గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రే టిప్పర్లతో సరిహద్దులు దాటిస్తున్నారు. కర్ణాటక సరిహద్దు మండలానికి ఆనుకుని ఉండడం ఇసుకాసురులకు కలిసి వస్తోంది. కౌండిన్య నదిలో దొరికే ఇసుక నాణ్యంగా ఉండడంతో కర్ణాటక వాసులు కొనేందుకు మొగ్గు చూపుతున్నారు. కర్ణాటకలో ఒక్కో టిప్పర్ ఇసుక రూ.50 వేలకుపైగా ధర పలుకుతుండడంతో ఇసుకాసురులకు అక్రమార్జన సులభంగా మారింది. దీనితో కూటమి నాయకులు, కార్యకర్తలు ఇసుక అక్రమ రవాణాకు తెరతీసి జేబులు నింపుకుంటున్నారు.

స్పందించని అధికార యంత్రాంగం

పలమనేరు ప్రాంతంలోని రాయలచెరువు ఏరు, కౌండిన్య నదీ పరివాహక ప్రాంతాల నుంచి రోజూ ట్రాక్టర్లు, టిప్పర్లలో కూటమి నేతలు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదు. కనీసం గతంలో వాల్టా చట్టాన్ని సాకుగా చూపైనా ఒకటో, రెండో ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేసేవారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీసు, రెవె న్యూ, మైనింగ్ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డురాకుండా ఉండేందుకు అక్రమార్కులు అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. అందువల్లే ఇంత దర్జాగా ఇసుక తరలించుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి మండలంలో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులకు జపనీస్ భాష ఎన్-5, ఎన్, ఎన్ 3 స్థాయిలో నేర్పించనున్నట్లు వివరించారు. అనంతరం సంబంధిత అభ్యర్థులకు జపాన్‌లో నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు 32 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. ముందస్తుగా ఆరు నెలల పాటు బెంగళూరులోని నావిస్ హెచ్‌ఆర్ సంస్థలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ రుసుం 3,50,000 ఉంటుందని, మొదటి విడతలో రూ.50 వేలు చెల్లించాలి. అందులో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రూ.25 వేలు చెల్లిస్తుందని మిగిలిన రూ.25 వేలు అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుందన్నారు. తదుపరి రూ.3 లక్షలను అభ్యర్థి మూడు విడతల్లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత జపాన్‌లో ఉద్యోగ అవకాశం, కావాల్సిన సదుపాయాలను ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్‌ఆర్ పర్యవేక్షిస్తుందన్నారు. ఉద్యోగం పొందే అభ్యర్థులకు జీతం నెలకు రూ.1,10,000 నుంచి 1,40,000 వరకు ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 93811 09098, 99888 53335లో సంప్రదించాలని కోరారు.

చిత్తూరులో జ్యోతిష్యుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జ్యోతిష్యుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శరవణపురానికి చెందిన శంకర్ పిళ్లై (68) గాయత్రీనగర్ మునిసిపల్ పార్కులో ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు జ్యోతిష్యం చెబుతూ జీవనం సాగిస్తుండగా.. అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

మాతృభాషను భావితరాలకు అందించాలి


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తెలుగు భాషా మాధుర్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, రచయితలపై ఉందని చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ జి శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ – తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు భాషా దినోత్సవం, గురుపూజోత్సవం జెడ్పీ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాచీనమైన తెలుగు భాషను విద్యార్థులకు అందించినప్పుడే మనుగడ సాధ్యమవుతుందన్నారు. నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ తెలుగు భాష అజరామరమైందని, అతి మధురమైందని కొనియాడారు. అనంతరం 50 మందితో కవి సమ్మేళనం, 25 మంది ప్రముఖులకు గిడుగుస్మారక పురస్కారాలు, 50 మంది తెలుగు పండితులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ స్వామి, సిద్ధారెడ్డి, సుమతి, చంద్రశేఖర్, హరిక్రిష్ణారెడ్డి, వి.రఘుపతి, దామోదర రెడ్డి, రత్నారెడ్డి, అశోకానంద రెడ్డి, ప్రముఖ సినీ నటి సీతమ్మ, డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ


కమలవేణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: పార్టీ కార్యకర్తలకు, నాయకులకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి అన్నారు. మండల పరిధిలోని గంగమాంబపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మణి భార్య కమలవేణి(65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి గ్రామానికి వెళ్లి కమలవేణి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్ఆర్‌పేట గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జేజేలు రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన్ను పరామర్శించారు. నారాయణ స్వామి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా నిచ్చారు. వారి వెంట నాయకులు ప్రేమనాధరెడ్డి,మూర్తి,మురళీకృష్ణారెడ్డి,సతీష్, మురాజ్, రామిరెడ్డి, రాము, ఎంపీటీసీ మురగయ్య, మాళులామణి, మోహన్, ఆశీర్వాదం, శ్రీనివాసులు, విజయులురెడ్డి, అంకయ్య, పద్మనాభశెట్టి ఉన్నారు.

బోయకొండ కిటకిట


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రద్దీ పెరగడంతో క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. పిండి, నూనె దీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు మృతి


రంజిత్‌కుమార్ (ఫైల్)

ఐరాల: ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఐలవారిపల్లెలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నరసింహులు కథనం మేరకు, ఐలవారిపల్లెకు చెందిన వెంకటాద్రి, కళావతి దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. శుక్రవారం రాత్రి గ్రామం సమీపంలో రంజిత్‌కుమార్(26) జయచంద్రారెడ్డి ట్రాక్టర్‌తో మట్టిని పొలానికి తోలుకుంటున్నాడు. అయితే మట్టి లోడుతో వస్తున్న ట్రాక్టర్ ట్రాలీపై ఉన్న రంజిత్‌కుమార్ ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈయనపై నుంచి ట్రాక్టర్ టైరు వెళ్లింది. తీవ్రంగా గాయపడిన రంజిత్‌కుమార్‌ను స్థానికులు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయాడు. తండ్రి వెంకటాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిప్పర్ బోల్తా: క్లీనర్ దుర్మరణం


మృతి చెందిన క్లీనర్

బంగారుపాళెం: ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు కంకర తరలిస్తున్న టిప్పర్ బోల్తాపడి క్లీనర్ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మల్లప్ప కథనం మేరకు, మండలంలోని బోడబండ్ల వద్ద ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. పనుల కోసం కంకర తరలిస్తున్న వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్లీనర్ నీరజ్‌కుమార్(37) మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ మల్లప్ప, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు పొట్టేళ్ల చోరీ

పలమనేరు: మండలంలోని ముసలిమడుగు సమీపంలో ఉన్న ఏటిగడ్డకు చెందిన ఆర్ముగం ఇంటివద్ద కట్టి ఉంచిన రెండు పొట్టేళ్లు చోరీకి గురైనట్టు బాధితుడు ఆదివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం సాయంత్రం ఆవుల షెడ్డువద్ద వీటిని కట్టేసి పడుకోగా ఆదివారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదని తెలిపాడు. గతంలోనూ తన పొలం వద్ద మేకలు, కోళ్లు, కేబుల్‌వైర్లు చోరీకి గురైనట్లు తెలిపాడు. ఇప్పుడూ పాత దొంగలే ఈ పని చేసుంటారనే అనుమానం ఉందన్నారు.

చిత్తూరు-తచ్చూరు హైవే నిర్మాణాన్ని అడ్డుకుంటాం


మాట్లాడుతున్న సీపీఐ నారాయణ

విజయపురం : విజయపురం, నింద్ర మండలం మధ్య నూతనగా నిర్మిస్తున్న చిత్తూరు-తచ్చూరు హైవే పక్కన పంట పొలాలకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, లేకుంటే హైవే పనులు అడ్డుకుంటామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు-తచ్చూరు మధ్య హైవే రోడ్డు వేయడం మంచిదేనని, కానీ హైవేకు భూములు ఇచ్చి మిగిలిన భూములకు సర్వీస్ రోడ్డు లేకుండా ప్రహరీ గోడలు నిర్మించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కారణంగా విత్తనాలు విత్తేటప్పుడు కానీ, పండిన పంటలను తరలించడంలో కానీ రైతులు క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. తక్షణమే పంట పొలాలకు దారులు ఏర్పాటు చేస్తూ సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే హైవేకు భూములు ఇచ్చిన రైతులను సమీకరించి పనులకు అడ్డుకుని ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. పాదిరి, బూచివానత్తం చెరువుకు నీరు వెళ్లే పిల్ల కాలువలను సైతం మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల్లోపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇది వరకే చిత్తూరు ఎంపీ దుగ్గమళ్ల ప్రసాద్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి అర్జీలు ఇచ్చామని గుర్తు చేశారు. కేంద్ర మంత్రి నితిన్ ఘడ్కరీకి లేఖ ఇచ్చినా, ఇంత వరకు ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమన్నారు.

ఉపాధి పనులు భేష్


తవణంపల్లె: ఫొటో గ్యాలరీని తిలకిస్తున్న ఉపాధి హామీ కేంద్ర బృందం

ఐరాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు భేషుగ్గా ఉన్నాయని జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్తా కితాబిచ్చారు. మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఆయన శనివారం జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ మల్లెల శివప్రసాద్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. తొలుతగా కాణిపాకంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులు, అవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. అక్కడి నుంచి కామినాయనపల్లెలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. రెడ్డివారిపల్లెలో రైతు కపిల్ ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను సందర్శించా రు. ఆశిష్ గుప్తా మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన వారికి వంద రోజులు పనిదినాలను కచ్చితంగా కల్పించాలని అధికారులను ఆదేశించా రు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు చక్కగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు, ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ సంధ్యారాణి, జేఈ శరత్, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

నీటి నిల్వ కుంటలను ఏర్పాటు చేయాలి

తవణంపల్లె: భూగర్భ జలాలు పెంపొందించడానికి వర్షపు నీరు వృథా కాకుండా నీటి కుంట కట్టడాలు కట్టాలని జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశీష్ గుప్తా అధికారులను ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2019వ ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం, జిల్లా అధికారులు శనివారం పరిశీలించారు. మండలంలో ని ఎంపీడీఓ, తహసీల్దార్, వెలుగు కార్యాలయాల వద్ద నిర్మించిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పనుల ఫొటో గ్యాలరీని సందర్శించారు. కేంద్ర బృందానికి జిల్లా అధికారులు పనుల వివరాలను వివరించారు. తవణంపల్లె సచివాలయం, ఆర్బీకే భవనాలను పరిశీలించారు. హౌసింగ్ కాలనీలో మొక్కలు నాటారు. కక్కలమిట్ట గ్రా మం సమీపంలో ఉపాధి నిధులతో రైతు సాగు చేస్తున్న పండ్ల తోటను, కొబ్బరి మొక్కల పెంపకాన్ని పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు పెంపొందించే దిశగా నీటి నిల్వల కుంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీడీ సుబ్రమణ్యం, శ్రీనివాసులు, సునీల్‌కుమార్, ఏపీఓ లలిత, హౌసింగ్ ఏఈ శ్రీధర్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.